కథానిక

# బద్ నసీహత్

= శ్రీ మునిమాణిక్యం నరసింహారావు =

"ఇవ్వాళ ఇంత పెందరాళే వచ్చేశారేం" అంటూ మా ఆవిడ నాకెదురుగా వచ్చి తలుపు తీసింది.

"యకాయకీని వచ్చేశాను" అంటూ లోపలికి అడుగు పెట్టి, "కాఫీ ఏమైనా ఉందా" అని అడిగాను.

"ఆ, ఉంది. రెడీగా ఉంది. మరే, మీకోసం ఎవరో పెద్దమనిషి వచ్చారు. పైన ఆఫీసుగదిలో కూర్చున్నారు ఆమటా" అని చెప్పింది మా ఆవిడ.

సరే ననుకొని, నేను గదిలోకి పోయి, కోటూ చొక్కా విడిచి, ముఖం కడుక్కొని, లుంగీ కట్టుకొని పైన తువాలా వేసికొని, పైకెళ్లాను వచ్చిం దెవరో చూద్దామని.

ఆ కూర్చున్న పెద్దమనిషి కొస్త వయస్సు మళ్లినవాడులా గున్నాడు. ఉంటే యాభై ఏండ్లు ఉండవచ్చు. కాని శరీరం ముడతలుపడ్డ ముసలి కాదు. యౌవన శేషం యింకా అతని అవయవాల్లో కొద్ది కొద్దిగా కనిపిస్తూ ఉంది. మీసం, తలా చాలా వరకు నెరిసినా అదో అందంగా ఉంది. మనిషి అమాయకుడులాగా, చాలా సౌమ్యుడులాగా కనిపించాడు.

నన్ను చూసేచూడ్డంతోటే ఆయన లేచి నమస్కారం చేశాడు. "తమరు ఎవరో నాకు జ్ఞాపకం లేదండీ, క్షమించాలె" అన్నాను నేను.

ఆయన కుర్చీలో కూర్చుంటూ అన్నాడూ—"అయ్యా, మీకు నేను పరిచయముడ్ని కాను, నన్ను మీ రెప్పుడూ చూడనూ లేదు. మాది అసలు విజయనగరం. నాపేరు సన్యాసిరాజు. మేము రాజుపేటలో కాపురం ఉన్నాము. తమ దర్శనార్థమై వచ్చాను" అని.

"అయ్యో, అంత పెద్దమాట ఎందుకండీ, నేనెంతపాటివాడ్ని" అన్నాను నేను నవ్వుతూ.

"అల్లా కాదండోయ్, తమకు మా ప్రాంతాల్లో మా చెడ్డ పేరుందండోయ్" అన్నాడు ఆయన తమాషా విజయనగరం యాసతో.

"చెడ్డ పేరాండీ?" అన్నా నేను వింతగా చూస్తూ.

నేను ఇల్లాగ అనటం జూచి ఆయన నొచ్చుకొని "క్షమించాలండి. చెడ్డపేరూ అంటే మహా దొడ్డపేరుందని మనవి చేస్తున్నాను" అన్నాడు. "అల్లాగనాండీ" అని ఒక చిరునవ్వు నవ్వి నే నూరుకొన్నాను. ఆయన మళ్లీ ఇల్లాగ అన్నాడు: "తమ కథలూ గట్రా చదివి మేము ఊఁ అనందిస్తూ ఉంటామండి. మా చెడ్డ తమాషాగా ఉంటాయిసుమండీ"

ఈ మాటలు విని, సంతోషించి, నేను ఊరుకొన్నాను. ఓ నిమిషం అయిన తరువాత ఆయన నా వంక జూస్తూ మళ్లీ అన్నాడూ—"తమర్ని, తమ కాంతాన్నీ, తమ సంతానాన్నీ చూచి ఆనందించాలనే ఉద్దేశంతో ఇల్లా వెళ్లిపోవచ్చానండీ" అని.

"ఏదో తమకు మాయందు అల్లాగ అభిమానం కలిగింది" అని నేను అంటూ ఉండంగానే ఆవిడగారు వచ్చింది, వెండి పళ్లెంలో నాల్గు కాల్చి నెయ్యి రాసిన

అప్పడాలు పెట్టుకొనీ, చేత్తో ఫ్లాస్కు పట్టుకొనీ. ఆవిడను చూడటంతోనే నేనన్నానూ—"అదిగో రానే వచ్చారు. ఆవిడేనండి కాంతాయమ్మగారు"అని.

సంతోషం, ఆశ్చర్యం కనపరుస్తూ ఆ పెద్ద మనిషి లేచి నిలబడి, "ఓహో, తమరేనా అమ్మా. సీతా అనసూయా చూశారూ, అల్లాంటి కోవలోని వారు తమరు" అంటూ కూర్చున్నాడు.

కాంతం ఒక్క క్షణం విచిత్రంగా చూచి, "బాబుగారూ, నన్నంతగా పెద్దచేయటం కేవలం మీకు మాయందుండే అభిమానం తప్ప మరోటి కాదు...ఇల్లా దయచేయండి, ఫలహారం పుచ్చుకోండి" అని ఆ పళ్లెంలోనుంచి రెండు అప్పడాలు తీసి నాచేతికిచ్చి, మిగిలిన రెండు అప్పడాలతో పళ్లెం ఆయన ముందు పెట్టింది. మే మిద్దరం అప్పడాలు కరకరా నమిలేసి, చెరోకప్పు కాఫీ తాగుతున్నాము.

ఇంతలో నే నన్నానూ—"మా కాంతం మహా యోగ్యురాలండి ఆ మహా ఇల్లాలియొక్క యోగ్యత వల్లనే మా కుటుంబానికి ఏలోటూ లేకుండా జరుగుతున్నది" అని. "మరేటండీ, ఆ మహాఇల్లాలి పాతివ్రత్య మహత్యం చేతనే మీకు ఇంత సిరీ సంపదా ఏర్పడ్డవి. మరి సందేహం లేదండీ" అని అన్నాడు ఆయన.

"ఇంకొంచెం కాఫీఅండీ" అన్నది కాంతం, ఆయనను ఉద్దేశించి. ఆయన అక్కరలే దన్నాడు. మరోక్షణం అయినతరువాత "పిల్లలు స్కూలునుంచి వచ్చేవేళైందండి, నేను సెలవ పుచ్చుకుంటానండీ బాబుగారూ" అని చెప్పి కాంతం మేడమెట్లు దిగి వెళ్లిపోయింది.

ఫలహారంకూడా అయిపోయింది. ఇంట్లో ఉడకపోస్తున్నది. బైటికి ఎక్కడికైనా వెడితే బాగుండునూ అని అనిపించింది నాకు. కాని ఆ పెద్దమనిషితో ఏం చెప్పాలో తెలియక కూర్చుని, రెండు నిమిషాలైనతరువాత నేనే అన్నానూ—"తమరేమైనా పనిమీద వచ్చినట్లా అండి" అని.

"ఎబ్బెబ్బే వృత్తినే వచ్చానండీ, మరేం పెద్దపనీ లేదూ..."అని ఆవాక్యం పూర్తి చేయకుండానే ఉండిపోయినాడు ఆయన.

ఇల్లాంటి పెద్దమనుష్యులతో చాలాబాధ. వాళ్లు వచ్చిన పనేదో చెప్పనూ చెప్పరూ, మనలను పోనీయనూ పోనీయరూ! ఎంతసేపూ అల్లాగ చూస్తూ కూర్చుంటారు. అందుకనే, నేను మళ్లీ అన్నాను— "చెప్పండి,ఏదైనా పనుంటే; సందేహిస్తున్నట్టున్నారు. చేయగలసాయం ఏమైనా ఉంటే చేస్తాను" అని. ఆయన అప్పటికీ మాట్లాడలేదు! జవాబుకోసం కాసేపు నిరీక్షించాను. లైను చూశాను. ఊహూ, ఎన్నిచేసినా ఆయననోట్లోనుంచి మాట పెగల్లేదు!

సాధారణంగా నాకోసం వచ్చేవాళ్లు రెండు రకాలుగా ఉంటారు: "కథ ఏమైనా వ్రాసి మాపత్రికకు ఇవ్వండీ" అని అడిగే పత్రికాధిపతులు ఒకరకం. ఈయనవాలకం చూస్తే ఆరకంమనిషి కాదని తెలుస్తూనే ఉంది. అది కాకపోతే "మా అబ్బాయికి నాలుగు మార్కులు వేసి ప్యాసుచేయించండీ" అంటూ వచ్చేది రెండోరకం.

ఈపెద్దమనిషి ఆరెండోరకంవాడు అయి ఉంటాడని తోచింది. నిజంగా అంతే అయి ఉంటుంది. లేకపోతే అంతసేపు నీళ్లు నమలటానికి అవసరం ఏముంటుందీ అనుకొని, "అయితే తమకు పిల్లలెంతమంది బాబూ" అన్నాను. "అయిదుగురండీ" అన్నాడు ఆయన. "ఊహూ, అయితే తమ పెద్దఅబ్బాయి ఏక్లాసూ?" అన్నాను, సంగతేదో తెలుసుకొని చెప్పాలిసిన మామూలుమాటలు చెప్పి తొందరగా పంపిద్దామని. ఆయన కొంచెం విచారంగా అన్నాడు—"నాకు మొగపిల్లలు లేరండీ, అయిదుగురూ ఆడపిల్లలేనండీ" అని.

ఈజబాబు విన్నతరువాత ఆయన ఎందుకొచ్చాడూ అన్న ప్రశ్న మరీ క్లిష్టమైపోయింది. నిర్మొగమాటంగా "అయితే మరిసెలవ-"అని చెప్పి పంపివేయటానికి మనస్సు ఒప్పలేదు. పిల్లల పెండ్లిళ్ల విషయంలో కూడా మాస్టర్లసాహాయ్యాన్ని ఇల్లాంటి పెద్దమనుష్యులు అపేక్షిస్తూ ఉండటం కద్దు. ఒకవేళ అల్లాంటి పనిమీద ఏమైనా వచ్చాడేమోనని, "పిల్లల పెండ్లిళ్లు అయినాయాఅండీ" అని కుశలప్రశ్న వేశాను.

"ఆ, పెద్దపిల్లలు ముగ్గురి పెండ్లీ అయింది. వాళ్లు కాపరానికికూడా వెళ్లారు. మిగిలిన ఇద్దరికీ సంబంధాలు

సిద్ధంగానే ఉన్నాయండీ, మీదయవల్లా" అన్నాడు. ఇక ఇల్లాంటి పిచ్చిప్రశ్నలతో కాలం గడపటానికి ఇష్టంలేక, కుర్చీలోనుంచి లేస్తూ "చిత్తం, అల్లాగ వెళ్లాలిసిన పనుందండి. మళ్లీ ఎప్పుడైనా తమ దర్శనం చేస్తాను" అన్నాను.

ఆయన తెల్లపోయి "చిత్తం, చిత్తం, అల్లాగే నండి. కాని, ఒక్క చిన్న విషయంలో తమ సలహా కావాలని వచ్చాను" అన్నాడు.

"అల్లాంటి దేమైనా ఉంటే చెప్పండి మరి" అని నిలబడిపోయినాను.

"మరేం లేదండీ. చూశారూ, తమరు కథల్లో సంసారాన్ని స్వర్గధామంగా వర్ణించారు" అంటూ మొదలుపెట్టాడు. నాకథలు మెచ్చుకుంటున్నాడు కాబట్టి నేను కూర్చోక తప్పిందికాదు.

మళ్లీ అన్నాడు ఆయన— "ఘోటకబ్రహ్మచారులకైనా కొంతంకథలు చదివినమీదట పెండ్లాడాలని బుద్ధిపుడుతుంది"అని.

"మీకు పూర్తిగా నాయందు అభిమానం" అన్నాను నేను.

"అల్లాకాదండోయ్. ముఖప్రీతికోసం అంటూన్న మాటలు కావండయ్యా...'సంసారం సాగరం దుఃఖం' అన్నమాటలు వ్యర్థపదాలని అనిపించారు తమరు"అంటూ ఆయన నన్ను మెచ్చుకొన్నాడు.

నేనూ సంతోషించి "అయితే తమ రేదో చిన్న పనిమీద వచ్చారన్నారూ!" అన్నాను ఆతురతతో.

"చిత్తం చిత్తం, మనవిచేస్తా. మరి, నాకూ పెండ్లాం బిడ్డలూ ఉన్నారండి. నాకు ఇల్లు జూస్తే నరకకూపంలా ఉందండి!! పిల్లలు చూద్దామా, అల్లరీ! పెళ్లాంచూద్దామా, గయ్యాళీ! నేనూ ఆమే కజ్జా ఆడని రోజు లేదండి. ప్రతిరోజూనూ ఏదోఒక విషయమై తగాయిదా వస్తూనేఉంటుందండి." అంటూ ఆయన కళ్లు తేలేసిచూడటం మొదలుపెట్టాడు.

"అయితే...నన్నేమి చేయమంటారూ?" అన్నా నేను నవ్వుతూ.

"తమరు మాకు ఏదైనా ఓ తరణోపాయం చూపెట్టాలె. ఎల్లాగప్రవర్తిచాలో, సాంసారికజీవనం సుఖప్రదం కావటానికి రహస్యం ఏమిటో తమరు సెలవిస్తే తెలుసుకొందామని కొండంత ఆశతో తమదగ్గరికి వెళ్లిపోవచ్చానండి. ఈ విషయంలో...కొద్దిగా, ......నాకు మీరు ఉపదేశం చెయ్యాలె" అంటూ ఆ పెద్దమనిషి ప్రాధేయపడ్డాడు.

"ఉపదేశం చెయ్యటానికి ఇదేమన్నా వేదాంతమా మంత్రశాస్త్రమా అండీ?" అన్నాను, నేను నవ్వుతూ. "మీరు అల్లాగ అంటే కాదు బాబూ, ఏదో మార్గం చూపా"లంటూ ఆయన ఒక్కతీరున బలవంతపెట్టాడు.

ఆయనమాట తోసేయటానికి వీల్లేకపోయింది. సరే, నాకు తోచిన ముక్కలు చెబుదాం, ఇందులో తప్పేముందీ అనుకొని "సరే, అసలు సంగతి....మీ భార్యను మీరు ప్రేమిస్తున్నారా"అన్నాను."అయ్యో, ప్రేమించకేమండీ; అయిదుగురు పిల్లల తండ్రినీ" అన్నాడు ఆయన. "అయితే పోట్లాటలు ఎందుకొస్తయ్యి" అన్నా.

ఆ పెద్దమనిషి నావంక తెల్లపోయి చూచి, ఒక్క క్షణం ఆలోచించి "బాబూ,చూశారూ, ఇదీ కారణం అంటూ చెప్పలేనండీ. అసలు ఒక కారణం అంటూ ఉండదండీ! ఉత్తినే, జైమంటూ లేస్తుందండీ. నేను అవును అన్నదానికల్లా ఆమెగారు కాదు అంటుంది ఎల్లాగండీ!" అంటూ ఆయన ముఖం చిట్లించుకొన్నాడు.

"అల్లా అయినట్లయితే మీరే ముందుగా కాదూ అనండీ" అని అన్నాను నేను వేళాకోళంగా.

ఈమాట, పాపం, ఆయనను కష్టంపెట్టింది. దీనంగా చూస్తూ అన్నాడు ఆయనా—"తమరు అల్లాగ సెలవిస్తే గాదు. సిన్సియర్‌గా చెపుతున్నాను. ఈ దిక్కుమాలిన పోట్లాటకు అంతు లేకుండా ఉంది. తమరు...ఏదో... తరణోపాయం చెప్పాలె" అని.

ఆయన్ను చూస్తే నాకు జాలేసింది. కాసేపు ఆలోచించి, చివరకు అన్నానూ—"అయితే సరే, ఒక చిన్న రహస్యం చెబుతాను వినండి. దాంతో మీకూ...మీకూ...పోట్లాటలు లేకుండా పోతవి" అని.

ఆయన, పాపం, ముఖం చేటంత చేసుకొని, "అదేనండీ, అల్లాంటి చట్కా రహస్యాలు చెబుతారనే...తమ దర్శనానికి వెళ్లిపోవచ్చానండీ" అన్నాడు.

"నేను చెప్పేదయినా అంత గొప్పవిషయం కాదు, స్వల్పవిషయమే అనుకోండి" అంటూ నేను ప్రారంభించాను. "తమరు చెప్పే విషయ మున్నది చూశారూ, అది ఎప్పటికీ స్వల్పవిషయం కాదనుకోండీ! సెలవియ్యండి" అంటూ ఆయన కుర్చీని నాకు దగ్గరసా లాక్కొని అత్యంతశ్రద్ధతో వింటానికి తయారైనాడు.

నన్ను ఆరాధించే భక్తుడు ఇన్నాళ్లకు దొరికినందుకు నేనూ సంతోషిస్తూ, గొప్ప స్త్రీవశీకరణ మంత్రాన్ని ఉపదేశిస్తున్నవాడిలాగ "చూడండీ, మీ విషయంలో చెప్పదగిన రహస్యం ఏమిటీ అంటే...ఆవిడగారు అవును అన్నదానికి మీ రెప్పుడూ కాదనబోకండి. మీ భార్యగారు ఇది బాగుందీ అంటే మీరూ బాగుంది, బాగుంది అని తాళం వెయ్యండి. ఆమెగారు దేన్ని చూచిఅయినా బాగుండలేదూ అన్నదా మీరూ ఛీ, ఛీ, ఏమీ బాగుండలేదూ అనండి. సంసారస్వర్గధామానికి ఇది ప్రథమసోపానం. తెలిసిందా అండీ?" అన్నాను.

పాపం, ఆయన తల ఊపి, "చిత్తం, చిత్తం. అయితే బాబూ, కొన్ని విషయాల్లో చూడండీ, డబ్బాబగ్రా వాడే విషయాల్లో ఆమెగారు చెప్పిందానికల్లా తల ఊపితే సంసారం గడవదు. ఏమంటారు?" అన్నాడు.

"అవునండీ, ఆసంగతి నాకు తెలుసు. మరీ..."

"అహహహహా. తమకు తెలియదని కాదు. ఉట్టినే మనవిచేశాను" అన్నాడు ఆయన ఎంతో నొచ్చుకుంటూ.

"ఇప్పుడు పండగా పబ్బం వచ్చిందా అంటే, మన తాహతు తెలుసుకోకుండానే అవి కావాలె, ఇవి కావాలె అంటారు ఆడవాళ్లు. వాళ్లు చెప్పిందానికల్లా మనం సరే అన్నామా అంటే అప్పులపాలు కావలిసిందే. అదేకదూ మీరనటం?" అన్నాను నేను.

ఆ బ్రాహ్మడు కుర్చీ మరింత దగ్గరసా లాక్కుంటూ "అద్గదీ బాబూ, అదీ అసలు సంగతి. వేధించుకు తింటూన్నదంటే నమ్మండీ! ఏం జేయమని సెలవు?" అన్నాడు.

"ఇప్పుడేం జేస్తున్నారూ?" అన్నా నేను.

"ఏంజేస్తున్నానూ, నాదగ్గర మదుపులేదూ- నేను తీసుకురాలేనూ అని బుర్ర నొక్కుంటాను బాబూ. మరేటి చేసేది" అని జవాబిచ్చాడు.

"అదే తప్పుపని" అన్నా నేను, ఠీవిగా, అధికారిలాగ. "మరేం జేయమని సెలవు" అంటూ ఆయన నమస్కరించాడు. ఆయన అల్లాంటి భక్తివిశ్వాసాలు చూపటంమూలాన, నాకు తెలియకుండానే నాలో ఒక గర్వంతో కూడిన భావం పరుగెత్తింది.

ఇహ నేను మొదలుపెట్టాను భార్యావశీకరణ సూత్రాన్ని: "చూశారూ, అల్లాంటి సమయాల్లో, భార్య కావాలన్న వస్తువు తీసుకురానూ అని మీ రెప్పుడూ అనకండి. విషయాన్ని మీకు ఇప్పుడు సూత్రప్రాయంగా చెప్పానన్నమాట. అంటే, తెస్తానూ తెస్తానూ అంటూనే మనం ఆడవాళ్లను బురిడీకొట్టించాలె. ఈవ్యాఖ్యానంతో తమకు బోధపడిం దనుకొంటా, ఏమంటారు?"

ఈమాటలు ఆయన శ్రద్ధగా విని తన జన్మతరించిం దన్నంత సంతోషాన్ని పొందినట్లు చూశాడు. "అదీగాకా ... ఆమెను లొంగతీసుకొంటే ఆమె ఎప్పుడూ మీ ఇష్టానికి వ్యతిరేకమైన కోరికలు కోరనే కోరదూ!" అని మరొక మహత్తరమైన గుప్తరహస్యాన్ని గూడా బయలుపెట్టేశాను.

"అదే! అదేనండి! ఆ లొంగతీసుకోనేది ఎల్లాగో తెలియకే! దానికేదైనా మార్గం సెలవియ్యాలె" అని మళ్లీ ఆయన ప్రాధేయపడ్డాడు.

రెండు కళ్లనూ వేళ్లతో నొక్కుకొన్నాను, ఒక్కక్షణం. తళుక్కున నాకళ్లముం దేదో మెరిసినట్లు తోచింది. దీర్ఘతపోదీక్షానంతరం జ్ఞానసంపన్నుడైన తథాగతునిలాగ చూస్తూ అన్నాను: "అల్లాఅయితే నే చెప్పినట్లు చేయండి: రోజుకు మూడుసార్లు..."

"ఏదైనా క్రియా అండీ?" అన్నాడాయన గుడ్లు పత్తికాయలంత చేసి ఆశ్చర్యంగా చూస్తూ.

"చెపుతా...రోజుకు మూడుసార్లు ... అంటే అధమపక్షం మూడుసార్లు అయినా భార్యను ముద్దు పెట్టుకోవాలె" అన్నాను నిమీలితనేత్రాలతో.

ఈమాటలు విని ఆయన, అరజౌన్సుఆముదం గుటుక్కున మింగినవాడిలాగా వికారంగా చూస్తూ "నాకు నలభైఎనిమిదో ఏడండి! మా ఆవిడకు నలభై

దాటిఉంటై! చికిత్సకు ఇల్లాంటిదికాక మరోరకం అనుపానం చెపటానికి..." అని ఏమో అనబోతుంటే, ఆయనను పూర్తిగా మాట్లాడనీయకుండానే నేనన్నానూ—"ఇటువంటి విషయాల్లో, చూశారూ, వయస్సుతో నిమిత్తం లేదు" అని.

"చిత్తం, సరే, అల్లాగే అనుకోండి. అయితే.. మా ముసలిదాన్ని రోజుకు మూడుసార్లు – అంటే... త్రికాలములయందూ ముద్దుపెట్టుకోమని సెలవాండీ?" అన్నాడు. నేను తప్పదన్నట్లుగా తలఊపాను.

కొంచెంసేపు తలవంచుకొని ఊరుకొని తరువాత మళ్లీ అన్నాడూ – "చిత్తం, ఇంకా, ఎల్లాంటిఎల్లాంటి పనులు చెయ్యాలో సెలవిచ్చే సెయ్యండీ" అని నిస్పృహతో.

"ముద్దుపెట్టుకోటం మొదటివిషయం. అది చెప్పాశాండీ! ఇక రెండోది: అధమపక్షం రోజుకు నాలుగైదుసార్లయినా, నిన్ను ప్రేమిస్తున్నాను, నిన్ను ప్రేమిస్తున్నాను అంటూ భర్త భార్యకు తెలియజెప్పాలె." అన్నాను.

"నే నెప్పుడూ, నాజన్మలో అల్లాంటి మాటలు అని ఎరగనండీ"అని దీనంగా అంటూ ఆయన నావంక చూశాడు.

జాలి లేకుండా కఠినపథ్యం చెప్పే వైద్యుడి ధోరణిలో "తప్పదండీ, నిష్కామకర్మ చెయ్యాలె. పోనీ, పాఠంలాగ ఒప్పజెప్పేసెయ్యండి" అంటూ పెదవి విరిచాను.

ఆయన కళ్లు మూసుకొని, ధ్యానం చేసుకొని "అల్లాగే. ఇంకా" అన్నాడు.

అంతవరకూ తలొంచుకొని ఆలోచిస్తున్న నేను తలెత్తి "ఇంకా ఏమిటీ అంటే, ఆమె సుగుణాలను ఎక్కువగా పొగడండి, ఇల్లాంటిదీ అల్లాంటిదీ అంటూ" అన్నాను.

మెదలకుండా వింటూ కూర్చున్నాడాయన. మరోనిమిషం అయింది. "ఇంకా దేముడు మేలుచేస్తే ఆమెసౌందర్యాన్ని గురించికూడా ఎక్కువగా మెచ్చుకోండి...ఊఁ... అంతే.. మరేంలేదు." అని చెప్పాల్సిన విషయాన్ని పూర్తి చేసినట్లుగా తల ఊపాను.

ఆయనకు నాయందు విశ్వాసము పూర్తిగా ఉంది. నేను చెప్పినట్లు ప్రవర్తించటానికి ఆయన నిశ్చయించుకోనూ నిశ్చయించుకొన్నాడు. కాని "పొగడటం నాకు అలవాటూ లేదు, తెలియనూ తెలియదు. మరి ఏమిటండీ కీలకం?"అని ఆయన నిట్టూర్పు విడిచాడు.

"తెలియటాని కేముందండీ? చూశారూ, ఆవిడపే రేమన్నారూ?" అన్నాను.

"చంద్రమ్మగారు" అన్నాడు.

"అయితే...మీరు ఆమెను చంద్రా అని... పిలుస్తారా?"

"ఏబ్బే, అసలు పేరుపెట్టి పిలవనండి"

"అవునులెండి. పేరుతో పిలవకూడదు కాబట్టి, జటాజూటశిరోమణీ అని పిలవండి."

"చిత్తం"

"పిల్చి, ఆపళంగా పొగిడేసెయ్యండి. ముందు ముఖం తీసుకోండి. 'నీముఖారవింద అవలోకితాపేక్ష'......"

"ఉండండి ఉండండి, లాభంలేదు. కాస్త తగ్గ స్థాయిలో ఉండాలె. రాసుకోమని సెలవా?"

"అఁహ. పోనీ, ఇల్లాగ అనండి. 'నీశరీరం పదారువన్నె పసిమితో మిసమిసలాడుతూ ఉంది. నీమధురాధరం బింబఫలారుణిమను సేకరించుకొన్నది. నీనాసికాపుటాలు నువ్వుపువ్వులను పోలియున్నవి.' తెలిసిందా? ఏమంటారు? ఈధోరణిలో వెళ్లిపోండి. ఆమె సౌందర్యాన్ని వర్ణించటానికి మీకు మాటలు దొరక్కపోతే వసుచరిత్రో పారిజాతాపహరణమో తిరగెయ్యండి." అని సలహా చెప్పాను.

నామాటలన్నీ విని బిక్కముఖంతో ఆయన సెలవ అని వెళ్లిపోయినాడు.

౨

ఆయన మేడమెట్లు దిగి వెళ్లిపోవటంతోనే మా కాంతం వచ్చి నాఎదట నిలబడి చురచురా చూస్తూ "పాపం, పెద్దవాడ్ని పట్టుకొని ఏమిటా వేళాకోళం?"అన్నది. నిజానికి ఆయనను వేళాకోళం చేయా

లని నాకు ఏకోశానా లేదు. నేను సిన్‌సియర్‌గానే చెప్పాను.

"లేదు కాంతం! నేను వెక్కిరింతకూ, వేళాకోళానికీ అన్న మాటలు కావు అవి. అట్లా ప్రవర్తిస్తే గృహకలహాలు ఎప్పుడూ ఉండవని నానమ్మకం. నేను అల్లాగ ప్రవర్తిస్తున్నానా...నే జేస్తున్న పనినే ఇంకొకర్ని చేయమన్నాను. ఇందులో నేను ఒకరిని ఫూల్ చేసిం దెక్కడా!" అన్నాను.

"అయితే, మీరు చేసే పిచ్చిచేష్ట లన్నింటినీ అందరినీ చేయమంటూ రేం ఖర్మం! నే కాంగా భరించి ఊరుకొంటున్నాగాని ఏఇల్లాలు ఊరుకొంటుందండీ" అంటూ ఆమె నవ్వసాగింది.

"నీవు పొరపడుతున్నావు. భర్త అల్లాగ ప్రవర్తించటం భార్యఅయిన ప్రతిస్త్రీకి ఇష్టమే ఇప్పుడు నే జెప్పిందంతా కూడా అనుభవంమీద ఆధారపడి ఉంది. అంతేకాకుండా ఆడదాని మానసికతత్వం తెలిసిన పండితులుకూడా ఒప్పుకొన్నదే. పొగిడితే ఎంతవాడైనా మెత్తపడతాడు. ఇక ఆడదాని మాట చెప్పక్కర్లేదు. ఏమంటావు?"

కాంతం ఏమీ మాట్లాడలేదు. ఆమెగారికి నా మాటలయందు ఏమీ విశ్వాస మున్నట్లు కనపడలేదు. అందుకని మళ్లీ అన్నాను..."నీకు తెలియదు. చాలా పరమరహస్యాలను ఆయనకు బోధించాను, చూస్తావుగా, ఇంకోవారంరోజులకు ఆయన మళ్లీ నాదగ్గర కొచ్చి 'బాబూ, మీదయవల్ల నాకష్టాలు గట్టెక్కినై. మాభార్యాభర్తలమధ్య పోట్లాటలు అంతరించినై. స్వర్గసౌఖ్యం అనుభవిస్తున్నాము' అంటూ చెప్పక పోతేనూ" అన్నాను గర్వంగా.

"అయ్యో! అయ్యో!" అంటూ మా ఆవిడ మూతీ ముక్కూ విరిచింది పతాకహస్తాన్ని అధోముఖంగా పెట్టి అటూ ఇటూ ఆడిస్తూ.

ఆవిడ అల్లాగ అన్నా నాకుమటుకు తృప్తిగానే ఉంది. నిజానికి నేను ఏంజేశానూ! భార్యను కొట్టమనలేదు, తిట్టమనలేదు; భార్యను ముద్దెట్టుకోమన్నాను. ఇందులో తప్పు ఏమిటో నాకు తోచలేదు. అయినా ఆవిడ అల్లాగ విరుపుగా మాట్లాడటం నాకు కష్టమేసింది.

అందుకని కాంతాన్ని పిలిచి మళ్లీ అన్నానూ "చూడూ, నేచెప్పిందాంట్లో తప్పు ఏమీలేదు. తప్పు అని ఎవరు అంటారో అనమను. నీవు ఒక్కదానివి బయలుదేరావు ఇవి పిచ్చిచేష్టలని చెప్పటానికి. అదీగాక ఇవి నీకు తెలియని విషయాలు. వీటిని సైకలాజికల్ ఎక్స్‌పెరిమెంట్సు అంటారు. మనస్సులో అద్భుతమైన మార్పులు వస్తవి" అని ఆవిడకు నామనఃస్థితిని విపులంగా చెప్పాను.

అప్పటికీ ఆవిడ కేమాత్రం నమ్మకం కలుగలేదుగాని నేనుమాత్రం, ఒక్క కుటుంబాన్ని గృహచ్ఛిద్ర పంకంలోనుంచి పైకెత్తగలిగాననీ, నారకసదృశమైన ఒక ప్రదేశాన్ని స్వర్గఖండంగా మార్చగలిగాననీ, ఒక దంపతిపూజ చేయగలిగానో, ఒక జోడుఆత్మలకు తృప్తినీ, ఆనందాన్నీ ఇయ్యగలిగాననీ నాలోనేను ఉప్పొంగిపోయినాను.

ఆయన మళ్లీ వచ్చి, తాను నే జెప్పినట్లు ప్రవర్తించినమీదట తన భార్యలో కలిగిన అనూహ్యమైన మార్పునుగూర్చి నాకు చెప్పి కృతజ్ఞతతో నమస్కరిస్తాడని నాకు ఘట్టినమ్మకం. కంటకపరివృతమైన తన జీవితపథము ఎట్లా మృదుమనోహరకుసుమవిరాజితమైందో, ఇతఃపూర్వం అపశ్రుతిరాగకఠోరమైన వృద్ధదంపతుల జీవితరాగం ఇప్పుడు ఎల్లాగ మనోహరైకశ్రుతిని మేళవించిందో, వికలశిలాశకలభయంకరమైన వారి కఠినజీవితశయ్య ఏరీతిని మృదుమనోహరసుమశయ్య అయిందో, కాకఘూకారవవ్యాకులమైన ఘోరజీవితకాంతారము ఎంత చిత్రంగా, శుకపికకోకిలారవవనదనోద్యానంగా మారిందో, ఝంఝూమారుతోద్ధూతోత్తుంగతరంగములచే చీకాకుపడిన తన సంసారసాగరంఎల్లాగ వైకుంఠవాసా వాసవటపత్రశయ్యాపయఃపయోధిగా మారిందో ఆయననోటితో ఆయనే చెపుతూఉంటే వినాలని నేను కుతూహలపడ్డాను.

అందుకని రోజూ సాయంత్రం స్కూలునుంచి రావటంతోనే "ఏం కాంతం, ఆయన నేమన్నా వచ్చాడా" అనేవాడ్ని. ఆమెగారు ముక్కు విరిచి "ఇంకా రావలసిందే" అంటూ వెక్కిరించేది.

## 3

ఇల్లాగ నాలుగురోజులు గడిచినై. అయిదోరోజున ప్రొద్దున్నే కాంతం నాదగ్గర కొచ్చి "మీకోసం ఎవరో అవ్వగారు వచ్చా"రంటూ నన్ను నిద్రలేపింది. నేను కళ్లు నలుపుకొంటూ లేచి క్రింది కెళ్లాను. హాల్లో నుంచి వంటింటికి పోయే గుమ్మంలో నుంచునిఉంది ఒకావిడ.

యాభైఏండ్ల వయస్సులో ఉన్న మనిషిలాగా కనిపించింది ఆవిడ. శరీరం దబ్బపండుఛాయ. ముఖాన కానీడబ్బంత కుంకపుబొట్టుంది. మామిడిచిగురుజరీ చీర కట్టుకొంది. కొప్పులో మందారపువ్వు ఉంది. కొద్దిగా, ముఖ్యంగా ముఖంపైన నెరిసింది. నలభైఏండ్ల క్రింద నన్ను భూమిమీద పడేసి వెళ్లిపోయిన మాఅమ్మే మళ్లీ నా ఇంటి కొచ్చినట్లుంది. లోపల ఈమాతృమూర్తిని నమస్కరిస్తూ నిలుచున్నాను.

"ఈముసలమ్మగారే మీకోసం వచ్చారండీ" అన్నది కాంతం. "ఏమిటండీ పిన్నిగారూ" అన్నా నేను. ఆమె నన్ను జూచి "ఏంనాయినా, నువ్వేనా మాకాంతం మొగుడివి"అంది,

"నేనే నేనండీ" అన్నాను నవ్వుతూ.

"ఏంనాయినా, నీవు...మా ఆయన కేదో ఉపదేశం చేశావుట కాదూ?"అన్నది ఆవిడ. "నేనేమిటి! ఉపదేశం చేయటమేమిటి! మీరు...నేను ఎవరని భ్రమపడుతున్నారోనూ" అన్నాను."కాదు నాయినా, నువ్వే చేశావుట" అన్నది ఆవిడ మళ్లీనూ.

"నే కాదండీ పిన్నిగారూ, నేను ఇంగ్లీషు చదువుకొన్నాను. నాకు మంత్రాలూ గింత్రాలూ రావండీ పిన్నిగారూ" అన్నాను.

ఆ ఇంగిలీషుమంత్రాలే ఉపదేశించావుట. లేదంటావేమిటి. నువ్వే!...కాంతమ్మమొగుడని ఆయన చెప్పారుకారూ ?" అన్నది.

"మొన్న మీదగ్గరకు రాలేదూ, ఆయనండీ" అని కాంతం ఎక్స్‌ప్లెయిన్ చేసింది.

అప్పుడు నేనన్నాను: "ఓహో, అదా సంగతి? పెద్దఉపదేశం ఏమిటి లెండి. ఇంట్లో పోట్లాటలు లేకుండాఉండటానికి కొన్ని మంచి సంగతులు చెప్పాను. మరేం లేదండీ" అన్నాను సంతోషంగా. పూర్వము మోస్తరుగా వాళ్లు పోట్లాడుకోకుండా హాయిగా శాంతంగా జీవిస్తూఉంటారు. ఆవిషయమై చెప్పటానికే ఆవిడ వచ్చిఉంటుంది.

ఇల్లా అనుకొంటూ నుంచున్నాను నేను. ఆవిడ నాదగ్గరసా రావటం నేను చూడనేలేదు. వచ్చి ఆమెగారు "నీవు ఉపదేశించిన మంత్రమే బెడిసికొట్టింది నాయినా"అని రహస్యంగా చెప్పేదానిలాగా చెప్పింది.

"బెడిసికొట్టటానికి నేనేమీ మంత్రం ఉపదేశించలేదండీ" అని ఆశ్చర్యపోయినాను

"రాకేం నాయినా, నీకొచ్చిన మంత్రాలు నీకొచ్చు. ఇంగిలీషులోమటుకు మంత్రాలు లేవంటావా?"

కాంతంవేపు తిరిగి "మంత్రాలు రావూ అంటారేమిటి నీమొగుడు... నేను ఇల్లాగ ఉంటే పిచ్చిది అనుకుంటున్నారు కామోసు. నాకు అన్నీ... తెలుసు నాయినా. కోయమంత్రాలు లేవమ్మా. అల్లాగే ఇంగిలీషుమంత్రాలు ఎందుకు ఉండవూ ? ఏవమ్మా?"అంది.

మాకాంతం చూడండి,ఆవిడపక్షం జేరి "ఎందుకు ఉండవండీ పిన్నిగారూ. ఉంటాయి." అని ఆమెగారి వైపు చూస్తూ "వచ్చునండీ. అబ్బో, ఈయనకు ఇంగ్లీషులో ఎన్నో మంత్రాలు వచ్చు" అని కళ్లు ఎగరేసింది.

"అయ్యో ఖర్మమా, ఇదేమిటండీ, నాకేం మంత్రాలూ రావు! నేను ఏమీ ఉపదేశమూ చెయ్యనూ లేదు" అన్నాను నేను విచారంగా.

"అల్లా అంటా డేమిటమ్మా నీమొగుడూ?" అన్నది ఆవిడ. "ఆయనంతే" అన్నది మాఆవిడ.

ఈఇద్దరూ ఇల్లాగ అంటూంటే నేనేమీ అనలేకపోయినాను. నన్ను తగలెయ్య, నా కిన్నిమంత్రాలు ఎల్లాగు వచ్చినయ్యా అని నాలో నాకే ఆశ్చర్యం కలిగింది.

మళ్లీ ఆముసలమ్మగారు ఇల్లాగ అన్నది: "లేదంటా వేమిటి నాయినా. మొన్న ఆయన ఇంటికి రావటంతోనే 'కాంతం మొగుడుగారివల్ల నేను ఉపదేశం పొందానూ, ఇక నీకూ నాకూ పోట్లాటలుండవు ఆమడా' అన్నారు. ఏమిటో అనుకొన్నాను. కృష్ణారామా అనుకుంటారుకామాలు ననుకొన్నాను. అసలు ఆయన శుద్ధ పిచ్చిబ్రాహ్మడు! అమాయకుడు!"

"అయితే ఇప్పుడు ఏం జరిగిందేమిటండీ" అన్నాను నేను.

"ఆరాత్రి, అంటే శుక్రవారంరాత్రినుంచే మొదలు నాయినా, పిచ్చిచూపులూ, పిచ్చిమాటలూనూ" అన్నది విచారంగా.

"నే నేమిపాపం ఎరగనే ఇదెక్కడి అవస్థరా బాబూ" అని నాకూ ఖంగారు పుట్టింది. "అయితే పిన్నిగారూ, ఏమిటీ ఆపిచ్చిమాటలూ" అన్నాను.

ఆభాగ్యశాలి నామాటలు వినిపించుకోకుండానే మా ఆవిడతో ఇల్లాగ అంటున్నది: "పిచ్చిమాటలు ఏమిషి కాంతమ్మతల్లీ, చెప్పటానికి వీల్లేదు. అల్లాంటి మాటలు మనం ఎప్పుడూ వినము. నీవైనా చెప్పు తల్లీ నీ మొగుడితో ఆమంత్రానికి విరుగుడు ఏమైనా చేయమని" అని కాంతాన్ని కాళ్లూవేళ్లూ పట్టుకొని బ్రతిమిలాడటం సాగించింది.

"ఊరుకోండి పిన్నిగారూ. ఉన్నవారు ఊరుకోక ఉపదేశంచేయటం ఎందుకు చెప్పండీ ఈయన?" అంటూ మా ఆవిడ, ముసలమ్మగారియందు సానుభూతి చూపటం మొదలెట్టింది. అక్కడికి నేను నిజంగా ఏదో మంత్రం ఉపదేశంచేసినట్లు!

మా ఆవిడకొంటెతనం చూస్తే నాకు కోపం వస్తున్నది. ఆముసలమ్మగారిని చూస్తే జాలీ కలుగుతున్నది. ఇంతకూ నాకు అసలుసంగతి ఏమిటో తెలియక, "అయితే, పిన్నిగారూ, ఏమిటాపిచ్చిమాటలు, ఎల్లాంటివి?" అన్నాను.

"ఒకలాంటి వేమిషి నాయినా, చిత్రచిత్రాలుగా మాట్లాడుతున్నారు" అన్నది ఆవిడ.

"ఎవరినైనా తిడతారా, ఏమిటే సంగతి?" అని మళ్లీ అడిగా నేను.

"తిట్టటమేకానీ, దీవించటమేకానీ, ఎల్లాగయినా అవి పిచ్చిమాటలుమటుకు అవును. మనబోటి సంసారుల కొంపల్లో అనుకునే మాటలు కావు" అంటూ ఆ ముసలమ్మగారు కళ్లను పమిటచెంగుతో అద్దుకొంది.

"అదిగాదండీ పిన్నిగారూ, ఆయన అన్న మాటలు ఒకటిరెండు చెప్పండి. సంగతేమిటో తెలుస్తుంది" అన్నాను నేను.

"చెప్పండి బామ్మగారూ, చెప్పండి. సంగతేదో తెలియొద్దూ ఆయనకు, విరుగుడుమంత్రం వేయటానికైనా" అన్నది.

"చెప్పాలిసిందేనా కాంతమ్మతల్లీ! ఇంతబతుకూ బతికి ఇంటివెనకాల చచ్చిన ట్లైంది. నాకర్మం కాలితే నానోటితోనే అనాలిసొచ్చింది ఆమాటలు!" అంది ఆవిడ మా ఆవిడతో. ఆముసలికళ్లలోనుంచి రెండు కన్నీటిచుక్కలు రాలినై.

మాతల్లిలాంటి మనిషి అల్లాగ విచారపడటం చూచి నేనూ ఎంతో కష్టపడ్డాను. అసలు ఆమెకొచ్చిన కష్టం ఏమిటో నాకు బోధపడలేదు. ఏంజెపుతుందో అని ఆవృద్ధురాలివంక చూస్తూ నిల్చున్నాను.

ఆవిడా కళ్లనీళ్లు తుడుచుకొని రుద్ధకంఠంతో ఇల్లా అన్నది: "నాబతుకంతా కడిగిపోస్తున్నారు నాయినా. నాముఖంమ.. చంద్రుడిలాగ ఉంటూన్నదమ—" అని ఆవిడ దుఃఖం ఆపుకోలేక భోరున ఏడ్చింది.

దుఃఖం కొంచెం ఆపుకొని ఇల్లాగ అన్నది మళ్లీ, జాలిగా చూస్తూ—"నాగొంతు పట్టుకుంటారు నాయినా... పట్టుకునీ, నీగళం శంఖంలాగ ఉన్నదీ అంటారు, నా గొంతుకొయ్య! ఇదీ వరస, ఇల్లా అయింది నాబతుకు" అంటూ ఆ అక్కగారు మళ్లీ దుఃఖపడ్డది.

నేను చెప్పిన నసీహత్‌కు ఇది ఫలితంకదా అని అప్పటికి నాకు తెలిసొచ్చింది. నిజానికి నవ్వవలసిన విషయమే. కాని ఆమెస్థితిని జూచి మేము ఇద్దరం కూడా నవ్వలేకపోయినాము. మాఉభయులకూ ఆవిడయందు జాలికలిగింది. బిక్కముఖాలతో నుంచున్నాం.

పిన్నిగారు తలుపుదగ్గరే ఒకమూలకు ఒత్తిగిలి "తెలిసిందా నాయినా, ఇదీవరస. ఇంకా, ఇంకా ఛండాలపు మాటలు అంటారు బాబూ! కొడుకులాంటివాడవు కాబట్టి చెపుతున్నాను. నాజుత్తుపా చమరీవాలాల్లాగో, ఏదో నాపిండం, అల్లా ఉన్నదమ!" అన్నది. ఆతరువాత ఒకక్షణం ఆమె మాట్లాడలేకపోయింది. నేను ఆవిడదుఃఖం చూడలేక అన్నాను— "సరేలెండి. ఎందుకూ ఇహ తెలిసింది."

నామాటకు అడ్డొచ్చి ఆవిడ మళ్లీ అన్నదీ— "చెపుతా, చెపుతా నాయినా. అంతా విను మరీ. నన్ను ఎగాదిగా చూస్తారు. పోనీ అని ఊరుకుంటా.

అయిందా, మడికట్టుకున్నా సరే వచ్చి ముట్టుకుంటారు. ముట్టుకొని నీశరీరం శిరీషకోమలమే అంటారు, నన్ను తగలెయ్య!"

ఆతరువాత రెండునిమిషాలదాకా ఆవిడకంఠం పెగలలేదు. మేము ముగ్గురంకూడా నిశ్శబ్దంగా నుంచున్నాము. కాసేపటికి ఆవిడ మాఆవిడబుజంమీద చెయ్యివేసి "కాంతమ్మతల్లీ, నేను చెప్పలేను ఆమాటలన్నీ. నన్ను బట్టుకు ఇల్లాంటి మాటలు అంటూఉంటే నిలువునా నీరైపోతున్నాను. కాంతమ్మతల్లీ, ముప్ఫైఏళ్లు సుఖంగా కాపరంచేశాను. ఎప్పుడూ ఇల్లాంటి పిచ్చిమాటలు ఆయన అనగా నే వినలేదు!" అని చెప్పుకొన్నది. చివరకు మళ్లీ అన్నది–"ఏంతల్లీ, ఎవరో కిరస్తానీలూ అప్రాచ్యులూ అనుకుంటారమ్మ గా అల్లాగ! ఏమోలే ఎల్లా ఎడిస్తే మనకెందుకు? మాగతి ఇల్లా ఐంది గదా" అని దుఃఖపడ్డది ఆవిడ.

ఈసంగతులన్నీ విని నేను నాలిక కొరుక్కున్నాను. మాఆవిడ ముక్కుమీద వేలేసుకొంది. ఆవిడా కాసేపు ఊరుకొని ఏదో జ్ఞాపకం వచ్చినట్లు తెప్పరిల్లి అన్నది–"అయితే, ఇంకోటి నాయినా! ఇల్లాగ పిచ్చిగా నానా మాటలూ అంటున్నా, రోజల్లా ఇల్లాగ మాట్లాడరు. మధ్యమధ్య బాగానే ఉంటారు. గుబులుకింద వస్తుందో ఏమో, రోజుకు నాలుగైదుసార్లు ఇల్లా అంటూ ఉంటారు. ఈతిక్క లేనపుడు మళ్లీ బాగానే ఉంటారు."

ఆ ముసలమ్మగారు ఇల్లాగ విచారపడి ఆఖరుకు కాంతం చెవిలో అన్నది:"ముసలిదాన్ని పట్టుకొని, పైగా, ముద్దు ముద్దు అంటారమ్మా, ఎక్కడ చచ్చేదీ–"

ఈమాటలన్నీ విని నేనేమీ అనలేకపోయినాను. కాంతంమటుకు నవ్వు ఆపుకోలేక పోతున్నది. "నేనేమీ ఎరగనండీ పిన్నిగారూ" అన్నాను నేను చివరకు. "నువ్వేమీ ఎరగకపోవటం ఏమిటి? నువ్వే చేశావు ఇదంతానూ!! విరుగుడుమంత్రం ఏదైనా ఉచ్చాటన చెయ్యి బాబూ. మాతండ్రివి గదూ." అంటూ, నాగడ్డాన్ని మునివేళ్లతో తాకి బతిమిలాడటం మొదలు పెట్టింది.

ఆమెదుఃఖం కాస్త తగ్గటం చూచి కాంతం అన్నది: "పిచ్చిగాదండీ, అవ్వగారూ, మీ ముసలాయనకు పిచ్చిగా దది! మీయందు ప్రేమ కనుపరుస్తున్నాడు."

"పోనీ, నీమాటే నిజమనుకో. అల్లా అయితే మటుకు ముప్ఫైఏళ్లనుంచీ లేనిదీ...ఇప్పుడు ఇల్లాగ వికారం కలగటం మంచే అంటావా? అయినా, పిచ్చి కాకపోవటం ఏమిటి?" అంటూ ఆవిడ మళ్లీ విచారపడ్డది. నేనూ, మాఆవిడా ఒక్కసారి నవ్వుకొన్నాము.

"మీరు ఇల్లాగ నవ్వితే నాబ్రతుకు ఏంకావాలె చెప్పు తండ్రీ! పోనీ, ఏభూతవైద్యుడి దగ్గరకైనాపోయి ఇంత విభూతి పట్టుకొద్దామా అంటే, నీవు చెప్పిన ఇంగ్లీషుమంత్రానికి అది పనిచేస్తుందో చేయదో!! నాబాబు కదూ. ఎట్లాగయినా నువ్వే దీనికి మళ్లీ ఇంగ్లీషులోనే ఉచ్చాటన చేసి నన్ను బైటపడెయ్యాలె" అంటూ ఆవిడ మళ్లీ బతిమిలాడింది.

ఆవిడను తృప్తిపరచటానికి ఒకటే మార్గం ఉందని తోచింది, అదేమిటే సరే ననటం. అందుకని నే నన్నానూ—"పిన్నిగారూ, పొరపాటే జరిగింది. నేను మళ్లీ ఇంగ్లీషులో ఉచ్చాటనచేసి, ఇదంతా పోగొడతాను. మీరేమీ భయపడకండి" అని.

ఆమెగారు ఈమాటలు విని అమితంగా సంతోషించింది. "మానాయనే. నీకు ఆడపిల్ల పుడుతుంది నాయనా. తప్పకుండా చెయ్యి" అని నన్నూ, మాఆవిడనూ దీవించి వెళ్లిపోయింది.

ఆవిడ వెళ్లిపోయినతరువాత కాంతం నవ్వు ఆపుకొని నాతో అన్నది—"మీరు పొరపాటుచేశారు. ఈమెగారికికూడా ఉపదేశం చెయ్యాలిసింది" అని.

"ఏమని" అని అడిగాను నేను.

"ఏమనా? ఆయనకు చెప్పినట్లుగానే, మొగుడి గుణసంపదనూ, సౌందర్యాన్నీ మెచ్చుకోమని."

నేను మాట్లాడలేదు.

ఆవిడ మళ్లీ ఎత్తుకొని ఇల్లాగ అన్నది: "మొగుడితో ఆవిడ ఇల్లాగ అనాలె—'ఓ ప్రాణనాథా, ఓనవమన్మథా, మీ మోహనమూర్తి సందర్శనమే నాకు తన్మయత్వం కలిగిస్తుంది. మీముఖచంద్రబింబ సందర్శనమే నాహృదయగభీరసాగరాన్ని పొంగులెత్తిస్తుంది. మీ మధురమైన పలుకులే......'"

"చాలించు" అన్నాను విసుగ్గా.

"ఏం?" అన్నది నవ్వుతూ.

"వెక్కిరిస్తే సహించే స్థితిలో లేను నేను. ఇప్పటికే చాలా విచారపడుతున్నాను. అసలు ఇల్లాగ అవుతుం దని అనుకోలేదు" అంటూ నేను మేడపైకి గబగబా వెళ్లిపోయాను.